ప్రజాశక్తి

మంగళవారం 26 మార్చి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సాగర్ ఆయకట్టు రైతులకు తొలగని కష్టాలు



- కలగా గోదావరి-పెన్నా అనుసంధానం
- శంకుస్థాపన చేసి ఆరేళ్లు అయినా ముందుకు కదలని పనులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గోదావరి-పెన్నా నదులు అనుసంధానం పనులకు శంకుస్థాపన చేసి ఆరేళ్లు గడిచినా ఇంత వరకు పనులు ముందుకు కదలలేదు. భూ సేకరణ నోటిఫికేషన్‌కు రైతులను ఒప్పించడంలో అధికారులు విఫలం అయ్యారు. భూ సేకరణను వ్యతిరేకిస్తున్న రైతులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు కనీసం చర్చలు జరపలేదు. 2018 నవంబరు 26 నకరికల్లులో అప్పటి సిఎం చంద్రబాబు అత్యంత అట్టహాసంగా ఈ పథకంకు శంకుస్థాపనే చేశారు. రూ.6020.15 కోట్ల అంచనాలతో ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. మొత్తం 66.60 కిలో మీటర్ల మేరకు కాలువలు తవ్వాలని, ఐదు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించాలని, ఇందుకు 577 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని డిపిఆర్‌లో పేర్కొన్నారు. 2019 మే నెలకల్లా గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా సాగర్‌కాల్వలలకు రప్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. టిడిపి హయంలో ఈపథకం పనులు ప్రారంభమే కాలేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ పల్నాడు దుర్భిక్షనివారణ పథకం పేరు మార్చినా పనులు చేపట్టలేదు. తాడికొండ, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోని ఏడు మండలాల పరిధిలో 30 గ్రామాల పరిధిలో 3541 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. భూసేకరణ ప్రక్రియ ప్రారంభించినా ఆశించినపురోగతి లేదు. ఐదు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి 2019 ఖరీఫ్‌కు గోదావరి నీటిని సాగర్ ఆయకట్టుకు తరలించాలని నిర్ణయించినా అప్పటి సిఎం చంద్రబాబుమాటలు నీటిమూటలయ్యాయి. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ప్రధానంగా నకరికల్లులో ఇప్పటికే పలు మార్పు వివిధ అభివృద్ధి పనుల పేరుతో భూసేకరణ జరిగింది. చాలా భూమి ప్రభుత్వమే తీసుకోవడం వల్ల సాగు భూమి కేవలం 700 ఎకరాలు మాత్రమే మిగులుతుందని రైతులు

అప్పట్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు. సాగర్ ఆయకట్టుకు రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని ఐదు ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్టు పనులు రూపకల్పన చేశారు. హరిశ్చంద్రపురం, లింగాపురం, ఉయ్యందన, గంగిరెడ్డిపాలెం, నకరికల్లులో ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని తలపెట్టారు.భూసేకరణ

2 లో

బాలికను మోసం చేసిన కేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ, సిఐ, వెనుక వరుసలో ముసుగులో నిందితుడు

ప్రజాశక్తి తెనాలి

బాలికను ప్రేమ పేరిట మోసం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్‌పి ఎం.రమేష్ బాబు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర లోని సోలాపూర్ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ జగదీష్ పడత్రే స్థానిక షరాఫ్ బజారు లో ఓ సిల్వర్ షాపులో పని చేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న బాలికతో పరిచయం పెంచు కున్నాడు. ప్రేమిస్తున్నానంటూ బాలికను లొంగదీసుకుని, గర్భవతిని చేశాడు. తనను పెళ్ళి చేసుకోవాల్సిందిగా బాలిక కోరటంతో అందుకు నిరాకరించాడు. దీంతో బాలిక తరపున జనవరి 29న పట్టణ ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుసుకున్న నిందితుడు సొంత రాష్ట్రానికి పరారయ్యాడు. ఎస్ఐ వై సుబ్బయ్య, ఏఎస్ఐ కె.రత్నరాజు నిందితుడి మొబైల్ ఆధారంగా కదలికలపై నిఘా ఉంచి, మహారాష్ట్ర వెళ్ళి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, ఆమె అనుమతితో అరెస్ట్ చేశామన్నారు. నిందితుడిపై నిఘా పెట్టిన మహారాష్ట్ర వెళ్ళి చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఎస్ఐ వై సుబ్బయ్య, ఏఎస్ఐ రత్నరాజు, కానిస్టేబుల్ ఎస్‌కె ఎండికె షరీఫ్‌లను డిఎస్‌పి అభినందించి, రివార్డులకు జిల్లా ఎస్పీ కి ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సిఐ జి.దశరథరామారావు, పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం

ప్రజాశక్తి-తాడికొండ :తాడికొండ అడ్డరోడ్డు చెకోపోస్టు వద్ద ఎస్ఐ వేణుగోపాల్ తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనీఖీలు నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఎ.శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న కారును ఆపి సోదా చేశారు. ఆయన వద్ద ఏ విధమైన ఆధారాలు లేని రూ.2,79,290 నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50,000 పైగా డబ్బును తీసుకెళ్తుంటే తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు..



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

ఇండియా వేదికను బలపరచండి

బిజెపి కూటమి, వైసిపిని ఓడించండి : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఆంధ్ర రాష్ట్రానికి అన్ని విధాలుగా ద్రోహం చేసిన బిజెపిని దానిని ప్రత్యక్షంగా, పరోక్షంగా బలపరుస్తున్న టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను రాబోయే ఎన్నికలలో ఓడించాలని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, విభజన చట్టంలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఇండియా వేదికను బలపరచాలని సిపిఎం పల్నాడుజిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పుతుంబాక భవన్లో నాయకులు గద్దె ఉమశ్రీ అధ్యక్షతన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ విజయ్ కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన ఎన్డీఏ కూటమి సభలో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర అభివృద్ధిని ప్రభావితం చేసే రాజధాని నిధులు, పోలవరం నిధులు, ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీలు, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మే విషయంలో ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. హిందువులను ముస్లింలను వేరు చేసే సిఎఎ చట్టాన్ని బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి, పార్టీలు వ్యతిరేకించడం లేదన్నారు. ఇక్కడ బిజెపి లేదు కదా అని ప్రజలు మోసపోవద్దని టిడిపి,

2 లో



8 లో

దాహం...దాహం

బొల్లాపల్లిలో అడుగంటిన భూగర్భ జలాలు - చుక్కనీరు ఇవ్వని చేతి పంపులు

ఆందోళన చేపట్టిన పట్టించుకోని అధికారులు

తాగునీరు లేక అల్లాడుతున్న గిరిజన వాసులు



గుంటూరు సిపిఎం జిల్లా కార్యాలయంలో బాపనయ్యకు నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు

కడ వరకూ కష్టజీవుల కోసం పోరాటం

గుంటూరు బాపనయ్యకు ఘన నివాళి 2లో



తుళ్లూరు రైతు దీక్షా శిబిరంలో దీక్షలు చేస్తున్న రైతులు, మహిళలు

ఇంటి వద్ద నుండి అమరావతి దీక్షలు

ఉద్యమం స్వరూపం మారుతుంది.. పోరాటం ఆగదు : జెఎసి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు ,రైతు కూలీలు చేస్తున్న దీక్షలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రైతులు దీక్షలను నిలిపివేశారు. ఈ మేరకు అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి (జెఎ సి), సమన్వయ కమిటీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఇక నుంచి దీక్షా శిబిరాలలో కాకుండా ఇళ్ళ వద్ద నిరసనలు తెలపాలని నిర్ణయించాయి. ఉద్యమం స్వరూపం మారుతుందే తప్ప పోరాటం ఆగదని రైతు కమిటీలు స్పష్టం చేశాయి.

నేటి నుంచి ఇళ్ళ వద్ద నిరసనలు..

ఎన్నికల నియమావళి, పోలీసుల సూచన మేరకు రాజధాని గ్రామాల్లోని రైతు దీక్షా శిబిరాల్లో ఆందోళనలకు తాత్కాలికంగా బ్రేక్ పడడంతో మంగళ వారం నుంచి ఇళ్ళ వద్దనే నిరసనలు కొనసాగించాలని రైతు జెఎసి, సమన్వయ కమిటీ నిర్ణయించాయి. కరోనా వ్యాప్తి చెందుతున్న కారణంగా గతంలో ఇళ్ళ వద్ద దీక్షలు చేసిన మాదిరి గానే ఆందోళనలు, అమరావతి వెలుగు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రైతు సంఘాలు వెల్లడించాయి. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించా

2 లో

ఇండియా వేదికను బలపరచండి

(మొదటి పేజీ తరువాయి)

జనసేన, వైసీపీ లకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లేనని అన్నారు. టిడిపి, జనసేన,వైసిపి పార్టీలకు ఎన్నెన్ని పార్లమెంటు సీట్లలో గెలిచిన ఆ సీట్లన్నీ కేంద్రంలోని బిజెపి పార్లమెంట్లో దేశ ప్రజలకు నష్టం కలిగించే ఎన్ని బిల్లులు పెట్టిన బిజెపికి అనుకూలంగా ఓటు వేస్తాయని ఆయన తెలిపారు. తద్వారా బిజెపి ప్రమాదం రాష్ట్రంలో అమలవుతుందని అన్నారు. ఈ ప్రమాదం నుండి రాష్ట్రాన్ని తప్పించాలంటేఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని సమస్యలను పరిష్కరిస్తానని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరకు చట్టం చేస్తానని, రుణ కమిషన్ ఏర్పాటు చేస్తానని ఇలా అనేక అంశాలతో కూడిన "పాంచ న్యాయ" పేరుతో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వంలోని "ఇండియా వేదిక"ను బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా వేదిక"ఇచ్చిన హామీలైన "పాంచ న్యాయం'లోని అంశాలన్నీ సిపిఎం కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేజ్రీవాల్ అరెస్టును, ఆప్ పార్టీ కార్యాలయంకు తాళాలు వేయడాన్ని, కాంగ్రెస్ పార్టీ అకౌంట్‌లను సీజ్ చేయడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. ఇలా చేయడం రాజకీయ పార్టీలను హక్కులను హరించటం, నియంతత్వాన్ని ప్రదర్శించడమేనని సమావేశం పేర్కొంది. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, కమిటీ సభ్యులు అనుముల వీరబ్రహ్మం"ఎం హరిపోతురాజు, జడ రాజకుమార్"పి ప్రభాకర్, షేక్ సైదులు,షేక్ మస్తాన్వలి, ఎ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నుండి అమరావతి దీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

లని డిమాండ్ చేస్తూ రాజధాని గ్రామాల్లో రైతులు,రైతు కూలీలు,మహిళలు దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. వెంకటపాలెం,మందడం, వెలగపూడి, తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో రైతు దీక్షాశిబిరాలలో దీక్షలు సాగుతున్నాయి.సోమవారంతో దీక్షలు 1560 వ రోజుకు చేరగా ఎన్నికల నేపథ్యంలో శిబిరాల్లో దీక్షలకు రైతు సంఘాలు తాత్కాలికంగా విరామం ప్రకటించాయి.

సాగర్ ఆయకట్టు రైతులకు తొలగని కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

హడావుడిగా చేపట్టే ప్రక్రియ కాదని ఇందుకు సంబంధించి చట్ట ప్రకారం చేయాల్సిన తంతు పూర్తి చేయాల్సి ఉన్నా వాటిని పట్టించుకోకుండా అప్పట్లో ఎన్నికల్లో గెలుపుకోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించినా తరువాత ప్రక్రియ ముందుకు సాగలేదు. క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. సాగర్ ఆయకట్టులో చాలా ప్రాంతాలకు ఎగువ నుంచి నీరు రాకపోవడం వల్ల రైతులు సకాలంలో పంటలు వేయలేకపోతున్నారని గోదావరి జలాల తరలించాలన్న ప్రతిపాదన కేవలం కాగితాలకేపరిమితం అయింది.

ఘనంగా హోళీ వేడుకలు

గుంటూరులో పాల్గొన్న మంత్రి రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లా వ్యాప్తంగా హోళి పండగ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యా, వ్యాపారసంస్థల నిర్వ హాకులు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజలు, యువతీ, యువకులు ఈ వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకుని సరదాగా గడిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెూలీ పండగని పురస్కరించుకుని పట్టాభిపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజలు,హెూలీ వేడుకలలో పాల్గొన్న మంత్రి విడదల రజిని మహిళతో కలసి రంగులు చల్లుకున్నారు.

కడ వరకూ కష్టజీవుల కోసం పోరాటం

గుంటూరు బాపనయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు బాపనయ్య ఆశయాలను ,లక్ష్యాలను కొనసాగించాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు .సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుంటూరు బాపనయ్య 46వ వర్ధంతి సభ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా పాశం రామారావు గుంటూరు బాపనయ్య గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకినేని బసవపున్నయ్య గారి ప్రోత్సాహంతో గుంటూరు బాపనయ్య కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. ఆయన జీవితంలో దళితుల కోసం ,పేదల కోసం చివరకు అంట పోరాటం చేశారని తెలిపారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉండి దళితుల హక్కుల కోసం పనిచేశారని, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. చల్లపల్లి జమిందార్ కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అగ్రభాగాన నిలబడి అనేక లంక భూములను పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. దివిసీమ ఉప్పెన సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ కార్యక్రమాలు అందించారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగాను ప్రధాన కార్యదర్శి గాను అఖిల భారత అధ్యక్షులుగాను పనిచేశారని, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాల రాస్తున్నాయని అలాగే బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు .ఇటువంటి పరిస్థితుల్లో బాపనయ్య గారు చూపిన మార్గాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారని అటువంటి సమాజం కోసం మన నిరంతర కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె నళినీకాంత్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి .శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కే .శ్రీనివాసరావు, బి .ముత్యాలరావు , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్ , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. కృష్ణకాంత్ సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, ఖాసిం, జన విజ్ఞాన వేదిక నాయకులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిని నిర్వీర్యం చేసిన జగన్

పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయడం ద్వారా రాష్ట్ర సంపదను సిఎం జగన్ నాశనం చేశారని టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండ మండలం లోని లాం గ్రామంలో సోమవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో తెనాలి శ్రావణ్ కుమార్ తో కలిసి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందరినీ వేధింపులకు గురి చేశారని అన్నారు. ఇసుక సరఫరా చేయకుండా భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టారని తెలిపారు. పేద కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతుంటే జగన్ ఏం పట్టించుకున్నారని ప్రశ్నించారు. లాం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లాం గ్రామంలో పేద వర్గాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సూపర్ సిక్స్ లో టిడిపి పథకాలను పేదలకు చేరువ చేస్తామన్నారు. ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రచార ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ పెమ్మసాని లాం గ్రామంలోని పలు ప్రాంతాలలో వ్యక్తులను, వర్గాలను కలుసుకొని ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని మరీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన నియోజకవర్గ నాయకులు విజయశేఖర్, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెమ్మసాని

గల్లా మాధవి ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టిడిపి అభ్యరి గల్లా మాధవి సోమవారం 18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసరావు పేట ఆరో లైన్ లోని అచ్చయ్య డాబా సెంటర్ వద్ద నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. పశ్చిమ నియోజకవర్గం ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని), టిడిపి నాయకులు సుఖవాసి శ్రీనివాసరావు తదితరలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారానికి చేపట్టారు. వార్డులోని మౌలిక వసతుల కల్పన దయనీయంగా ఉందని స్థానికులు మాదవికి తెలియజేశారు. కార్యకర్తలు అభిమానుల ఆదరణతో గెలుపు సాధిస్తానని ఆమె తెలిపారు. డివిజన్ అధ్యక్షులు ఉప్పుతల్లా సాంబశివ, క్లస్టర్ మహిళా అధ్యక్షులు జ్యోతి, కార్పొరేటర్ ఏరంటి వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సౌత్‌జోన్ ఓపెన్ ఆర్చరీ పోటీల్లో

ఎపి క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

తమిళనాడులోని సాయిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న కేలో ఇండియా యన్‌టిపిసి సౌత్‌జోన్ ఓపెన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు ఛాంపియన్‌షిప్‌గా నిలిచిందని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్/ జట్టు నుండి ప్రాతినిధ్యం వహించిన చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి క్రీడాకారులు రికర్వు, కాంపౌండ్ విభాగాలలో సత్తా చాటి ఛాంపియన్‌గా నిలిచారన్నారు. రికర్వు మహిళల విభాగంలో కొండపావులూరి యుక్తశ్రీ, ప్రథమ స్థానం సాధించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. కాంపౌండ్ పురుషుల విభాగంలో కుందేరు వెంకటాద్రి ప్రథమ స్థానం సాధించి పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచాడని తెలిపారు. టి.గణేష్ మణిరత్నం కాంపౌండ్ విభాగం, పురుషుల విభాగంలో మూడవ స్థానం సాధించినట్లు తెలిపారు. కర్రి సుష్మిత్ కాంపౌండ్ మహిళా విభాగంలో మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవశం చేసుకున్నట్లు తెలిపారు. రికర్వు పురుషుల విభాగంలో జి.బైరాగినాయుడు రెండవ స్థానం సాధించి రజత పతకం సాధించినట్లు తెలిపారు.



కెఎల్‌యు విద్యార్థుల ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కె.ఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని బి.ఎ.ఐ.ఎ.ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27,28 తేదీల్లో నిర్వహించబోయే జాతీయ స్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవం 'ఆర్త్రోబ్-2024ను పురస్కరిం చుకుని విద్యార్థులు ఫ్లాష్ మాబ్‌ను సోమవారం విజయ వాడలోని ట్రెండ్ సెట్‌మాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎ ఐఎఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ ఈ ఫ్లాష్ మాబ్‌లో విద్యార్థులు ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను చాటే విధంగా తమ సంగీత, నాట్య విన్యాసాలతో యువతను ఉర్రూతలూగించారు. మాక్ పార్లమెంటు, క్విజ్ పోటీలు, దేశీయ, పాశ్చాత్య నృత్యం, సంగీతం, సాంకేతిక, సాహిత్య, చిత్రలేఖన, డిజె.నైట్ మొదలైన అనేక అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కె.ఎల్.యూనివర్సిటీ బి.ఎ.ఐ.ఎ.ఎస్ ఆధ్వర్యంలో, యూనివర్సిటీ ఆవరణలో నిర్వహించబోయే ఈ యువజనోత్సవాన్ని ఆకర్షించే ఫ్లాష్ మాబ్‌ను అధిక సంఖ్యలో జనం తిలకించారు. వివిధ పోటీల్లో పాల్గొనటానికి అనేక కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించినందుకు యూనివర్సిటీ ఎంహెచ్ ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, బి.ఏ.విభాగ అధిపతి డాక్టర్ బి.శివనాగయ్య విద్యార్థులను అభినందించారు. ఆర్ట్స్ విభాగ ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ ఆర్.సాయికుమార్, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ బాలాజీ మానసా రావు, విద్యార్థి కో- ఆర్డినేటర్లు స్వామి పర్యవేక్షించారు.



తాడేపల్లి అభివృద్ధి చర్చకు సిద్ధమా? : మురళి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరిలో వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, ఈ ఐదేళ్ల తాడేపల్లిలో జరిగిన అభివృద్ధిపై వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా అనితాడేపల్లి టీడిపి నాయకులు అద్దంకి మురళీ సవాల్ విసిరారు. సోమవారం ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడాన్ని ఖండించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 100 కోట్ల రూపాయలతో తాడేపల్లి ప్రజలకు మంచినీరు అందించదానికి ప్రణాళికలు సిద్ధం చేసి, శంకుస్థాపన చేస్తే నిర్వీర్యం చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కక్షపూరితంగా ఇప్పటం గ్రామంలో ఇళ్లను తొలగించారన్నారు. గత ఎన్నికల సమయంలో నులకపేట, ప్రకాష్ నగర్ ప్రాంతాల ప్రజలకు ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారన్నారు అనేక హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి మోసం చేశారని విమర్శించారు. ప్రజలు వైసీపీని నమ్మే పరిస్థితిలో లేరని, మంగళగిరిలో నారా లోకేష్ విజయం ఖాయమని చెప్పారు.

మండుతున్న ఎండలతో కోళ్ల మృత్యువాత

- కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం
- రాయితీపై ఫాగింగ్ యంత్రాలు, కోడి పిల్లలు, దాణా సరఫరా చేయాలని రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండుతున్న ఎండలు, వడగాడ్పులు కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 10 రోజులుగా వీస్తున్న వేడి గాలులకు పల్నాడు జిల్లాలో బ్రాయిలర్ కోళ్లు, గుడ్లు పెట్టే కోళ్లు వేలా దిగా చనిపోతున్నాయని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత ఎక్కువగా ఉండడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. ఇటీవల నెల్లూరులో బర్డ్ ఫ్లూ కలకలంతో అనేక ప్రాంతాలలో కోళ్ల ఫారాలన్నీ ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఎగుమతులు జరుగుతాయని, వేసవి కాలంలో కోళ్లకు ఇతర వ్యాధులు సోకే అవకాశాలు తక్కువగా ఉండటంతో



ఎండ తీవ్రత నుంచి కోళ్లను కాపాడుకుంటే సరిపోతుందన్న ఉద్దేశ్యంతో కోళ్ల ఫారాల నిర్వాహకులు ప్రస్తుతం బ్యాచ్ లు వేశారు.

అయితే, కోళ్ల ఫారాల చుట్టూ గోనెలు కట్టి వీటిని నీటితో తడపడం, కోళ్లపై కూడా ప్రత్యేక యంత్రాలతో నీళ్లు చిమ్ముతున్నా వాటిని కాపాడలేకపోతున్నారు. ఎన్నడూ లేని సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల క్రితం రాయితీలతో అప్పటి ప్రభుత్వాలు ప్రోత్సహించేవని, ఆంధ్రరాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే పరిస్థితి ఉండేవని చెబుతున్నారు.

ప్రస్తుతం తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పూణే, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమలకు ఆయా ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని, రాయితీలు ఇస్తున్న నేపథ్యంలో ఉత్పత్తి వ్యయం తగ్గి అధిక సంఖ్యలో కోళ్లను ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆంధ్ర రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పల్నాడు జిల్లాలో ఫారాలు 15 లక్షలకు పైగా బ్రాయిలర్ కోళ్లను, 6 లక్షలకు పైగా లేయర్స్ కోళ్లను పెంచే సామర్థ్యం ఉన్న షెడ్లు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి



ఆరంభంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నాయని, ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని ఊహించిన రైతులు కోళ్ల సంఖ్యను తగ్గించారు. అయినప్పటికీ ఎండ తీవ్రత, వేడి గాలులకు కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో నష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల పరిధిలో అధిక సంఖ్యలో కోళ్ల పెంపకం దారులు ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఒక మోస్తరుగా కోళ్ల పెంపకం దారులు ఉన్నారు. ఎండ తీవ్రతకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా రోజుకు వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నట్లు చెబుతున్నారు.

ప్రధానంగా కోళ్లకు చర్మంపై స్వేద రంధ్రాలు ఉండక పోవడంతో ఇవి శరీరంలో వేడిని నోటి ద్వారానే బయటకు పంపాల్సి ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేక చనిపోతున్నాయి. ప్రస్తుతం ధరల ప్రకారం కోడిపిల్ల కొనుగోలుకు రైతు రూ.50కు కొనుగోలు చేస్తున్నట్లు ,పెంపకానికి మేత, కూలీ, విద్యుత్తు బిల్లు కలిపి ఒక్కో కోడికి రూ.240 వరకు ఖర్చు



అవుతుంది. ప్రస్తుతం మార్కెట్ ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో నష్టాలు బాట తప్పదు. మార్కెట్‌లో చికెన్ వినియోగం, ధరలు బాగున్నప్పటికి పెంపకందారులకు మాత్రం కష్టనష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

డి.ఆంజనేయులు, ఇక్కుర్తి, నరసరావుపేట మండలం



మేత, నిర్వహణ వ్యయాలు భారంగా ఉన్న సమయంలో ఇలా వడదెబ్బతో కోళ్లు చని పోవడంతో చిన్న రైతులు పూర్తిగా కుదేలవుతున్నారు. ఫారాల చుట్టూ గోనె పట్టలు కట్టి నీళ్లతో తడుపుతున్నాం. ఎండలు ఇలాగే ఉంటే కోళ్లు ఇంకా పెద్ద సంఖ్యలో చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుండి పౌల్ట్రీ రైతులకు ఎటువంటి సహాయం అందడం లేదు. బ్యాంకులలో రుణాలు తీసుకుని పారాలు నిర్వహిస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఫాగింగ్ యంత్రాలు, కోళ్ల దాణాలో ప్రధాన ముడిసరుకు అయిన మొక్క జొన్నలు కోడి



పిల్లలు రాయితీ అందించి ఆదుకోవాలి. దిగుమతులు నిలిపివేయాలి.

మేత తినడం లేదు

కె.శ్రీనివాసరావు,(ఇతని ఫోటో లేదు) గుండేపల్లి, ఈపూరు మండలం.

ఎండ తీవ్రతకు ఉదయం 9 గంటల నుంచి మొదలుకొని రాత్రి వరకూ చనిపోతూనే ఉన్నాయి. వీటిని కాపాడటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు రోజూ 150 వరకు చనిపోతున్నాయి. మేత సరిగా తినడం లేదు. అత్యధిక ఉష్ణోగ్రతకు తట్టుకోలేకపోతున్నాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది నష్టపోయిన పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం అదుకోవాలి.

విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

ప్రజాశక్తి-రెంటచింతల



విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది పోలీసుల వివరాల ప్రకారం మండలం లోని పాల్వాయికి చెందిన గుంట మణికంఠరెడ్డి (32) ఇంటి ఎదురుగా ఉన్న బోరు మోటార్‌కు పని చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే చని పోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్సై నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుండెపోటుతో మాజీ సైనికుడు హఠాన్మరణం

ప్రజాశక్తి - రెంటచింతల



1999 సంవత్సరంలో కార్గిల్ యుద్ధంలో విశిష్టమైన సేవలు అందించిన పమ్మి అంజిరెడ్డి(46) గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని బాపట్ల వాయిసేన సిబ్బంది, రాష్ట్ర త్రిదలాల మాజీ సైనికుల కమిటీ చైర్మన్ శ్రీనివాస వరప్రసాద్ అన్నారు మండలం లోని పసర్లపాడుకు చెందిన పమ్మి అంజిరెడ్డి 1998 లో వాయు దళంలో చేరి ఇరవై ఏళ్ల పాటు దేశ సేవ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన మృతదేహంపై త్రివర్ణ పతాకం కప్పి పూలమాలతో నివాళులర్పించి గౌరవం వందనం చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంజిరెడ్డికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. నివాళులర్పించిన వారిలో బాపట్ల వాయుసేనకు చెందిన సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

ఉపాధి పనుల్లో రూ. 3.5 కోట్ల నిధులు గోల్ మాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పెదనందిపాడు మండలం ఏపీవో ఎ. లక్ష్మీపతి, కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్ అకౌంటెంట్ ఎం. రాజ్యలక్ష్మిని సస్పెండ్ చేస్తూ అధికారులు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పనులు చేయకుండానే బిల్లులు పెట్టిన వైనం జిల్లా కలెక్టరు ఎం. వేణుగో పాల్ రెడ్డి విచారణకు ఆదేశించారు. పలువురు అధికారులు, ఉద్యోగులపై ఇటీవల విచారణ చేశారు. పనులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకుండానే బిల్లులు పెట్టినందుకు ఏ పి వో , కంప్యూటర్ ఆపరేటర్లను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు పి.ఉమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉత్త ర్వులను పెదనందిపాడు మండలం ఎంపీడీవోకు పంపి ఉద్యోగులను విధుల నుంచి తప్పించాలని సూచించారు. ఈ బిల్లుల రూపకల్పనలో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఈ ఆనంద రావు విచారణ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ జి. బ్రహ్మయ్యకు డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు పి.ఉమాదేవి లేఖ రాశారు. ఆనందరావుపై గతంలో కూడా పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి.

అనిల్‌కుమార్ వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నరసరావుపేట లోక్‌సభ వైసిపి అభ్యర్థి పొల్లుబోయిన అనిల్ కుమార్ కాన్వాయ్‌ను పోలీసులు తాడేపల్లి వద్ద సోమవారం రాత్రి తనిఖీ చేశారు. గుంటూరు నుంచి విజయవాడకు వెళ్ళే క్రమంలో తాడేపల్లి వద్ద పోలీస్ చెక్ పోస్టు వద్ద కార్లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో



ఎటువంటి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకోలేదని పోలీసులు తెలిపారు.



మంచినీటిని సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రపంచ జలదినోత్సవం వారో త్స వాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక, లాలూ దాదా సాహెబ్ సేవా సమితి ఆధ్వ ర్యంలో స్థానిక పండరీపురం 10వ లైన్‌లోని బ్రిలియంట్ స్కూల్‌లో సోమవారం నాల్గో రోజు కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరి ముల్లా మాట్లాడుతూ మంచినీటిని సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. వర్షపు నీటిని నిలువ చేయ డం కోసం, ఎవరికి వారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసు కోవాలన్నారు. ఇందులో భాగంగా జనవిజ్ఞాన వేదిక ప్రచు రించిన 'నీటి సంరక్షణ' అనే పుస్తకాన్ని 50 మంది విద్యా ర్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సం ఘం నాయకులు చేవూరి కృష్ణ మూర్తి, జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, పాఠశాల డైరెక్టర్ మద్దిరాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు కృష్ణారావు

విద్యార్థికి రూ.25వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతిభ కలిగి చదువులో ముందుండే విద్యార్థులకు పేద రికం అడ్డుకాకూడదని ఉద్దేశ్యంతో బొల్లు రాజేశ్వరి కృష్ణారావు ఛారిటబుల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నటు ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు బొల్లు కృష్ణారావు చెప్పారు. చిలకలూరిపేట మండలంలోని యడవల్లికి చెందిన ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న పేద విద్యార్థి బొల్లు తారక్ నాథ్ ఆర్థిక సహాయం కోసం సంప్రదించాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ విద్యార్థికి రూ.25 వేల చెక్కును కృష్ణా రావు అందజేశారు. కృష్ణారావు మాట్లాడుతూ విద్య ద్వారా కుటుంబం, సమాజం తద్వారా దేశం అభివృద్ధి చెందుతుం దని అన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గతంలో ఎంతో మంది పేదవిద్యార్థులకు సహాయ సహకారాలు అంద జేసినట్లు చెప్పారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బి.వెంకటేశ్వర్లు, ఎం రామకృష్ణ బివిఎఎల్ వరప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-నూజెండ్ల



మండలంలోని గుర్రపునాయుడు పాలెం, అన్నవరం గ్రామాల్లో సోమవారం సిఐ సుధాకర్ బాబు, ఎస్ఐ లక్ష్మీనారా యణరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు, రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాం తంగా జరిగేలా రాజకీయ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏ ఒక్కరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త ఎన్నికలకు సంబంధించి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిరంతర ప్రజా సేవకుడు గుంటూరు బాపనయ్య

వర్ధంతి సభలో సిపిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

దళిత కుటుంబంలో పుట్టి నిరంతరం ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన సిపిఎం నాయకులు, మాజీ శాసనసభ్యులు,గుంటూరు బాపనయ్య చిరస్మరణీయులని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన గుంటూరు బాపనయ్య వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముం దుగా బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. విజయ్ కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ దళిత కుటుంబంలో పుట్టి చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా జరిగిన భూ పోరాటంలో రాటు తేలి గుం టూరు బాపనయ్య తన జీవితాన్ని నిరంతర ప్రజా సేవకే అంకితం చేశారని అన్నారు. నిడు మోలు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గాను ఎమ్మెల్సీ గా ప్రజా సేవలందించారని అన్నారు. బాపనయ్యను ప్రతి సిపిఎం కార్యకర్త ఆదర్శంగా తీసుకుని, ఆయన బాటలో పయనించటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సభలో సిపిఎం నాయకులు గద్దె ఉమాశ్రీ, అను ముల వీర బ్రహ్మం, కట్ట శివ దుర్గా రావు, సెగ్గెం వెంకటేశ్వరరావు, ఎం.హరి పోతు రాజు, మామిడి జగన్నాథరావు ప్రభాకర్, షేక్ మస్తాన్ వలి, జడ రాజకుమార్ తది తరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-క్రోసూరు


ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి భూమి దక్కాలని, పని అయినా చూపాలి లేదా తిండి అయినా పెట్టాలని పోరాడిన మహోన్నత వ్యక్తి గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో బాపనయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ జమీందారీ వ్యవస్థ పోవాలని, పేదలకు భూమి దక్కాలని చల్లపల్లి జమిందార్ కి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులను సమీకరించి వీరోచిత పోరాటం నడిపిన వ్యక్తి బాపనయ్య అని అన్నారు. వ్యవసాయ కార్మికులైన దళితులు,మహిళలు వారు ఎదుర్కొంటున్న వివక్ష, అంటరానితనం నిర్మూలన జరగాలని సామాజిక పోరా టాన్ని కూడా ఆయన నడిపారని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మికుల జీవితాల్లో కొంత మెరుగుదల కనిపించిన పెరిగిన భారత దేశ సంపదకు తగ్గట్టుగా వ్యవసాయ కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదని అన్నారు. ఇప్పటికీ సుదూర ప్రాం తాలకు వలసలు వెళితే తప్ప కుటుంబాలు గడవని పరిస్థితి తని అన్నారు. పాలకులు వేస్తున్న బారాలు వలన ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు పనులు తగ్గిపోతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను రెండు వందల రోజులకు పెంచి ఇస్తున్న వేతనాన్ని కూడా పెంచాలని వ్యవసాయం కార్మిక సంఘం చేయనున్న ఉద్యమాలలో ప్రజలు భాగ స్వాములు కావాలని కోరారు. కార్య క్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఏపూరి వెంకటేశ్వర్లు,గంటెల చిన్నప్ప మం డల కమిటీ సభ్యులు షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యడ్లపాడు

స్థానిక పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో గుంటూరు బాపనయ్య వర్ధంతి సభ జరిగింది. సభకు సీనియర్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముత్తవరపు సాంబశివరావు అధ్యక్షత వహించారు. తొలుత బాపనయ్య చిత్ర పటానికి వ్య.కా.స మండల అధ్యక్షులు డి. అన్నపూర్ణమ్మ పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం జిల్లా వ్యకాస అధ్యక్షులు కారుచోల రోశయ్య మాట్లా డుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడి పేదలకు పని చూపించాల్సింది పోయి, కార్పోరేట్ శక్తులకు అప్పచెప్పే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా చేసే ఉద్య మంలో వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో జె. శంకరం, ఆంజనేయులు, శ్రీనావాసరావు పాల్గొన్నారు.


గుంటూరు బాపనయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు


క్రోసూరులో..


యడ్లపాడులో..

మతోన్మాదం, సామ్రాజ్యవాదంపై పోరాడాలి




రొంపిచర్లలో భగత్‌సింగ్ వర్ధంతి సభకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త పిఎ దేవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశంలో భగత్ సింగ్ ఆశించిన పాలన కాకుండా నేటి ప్రభుత్వాలు స్వార్థ పూరితంగా వ్యవహరిస్తున్నాయని సామా జిక కార్యకర్త పిఎ దేవి విమర్శించారు. నరసరావుపేట నియోజకవర్గంలోని మం డల కేంద్రం రొంపిచర్ల భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్ 93వ వర్ధంతి సభ జరిగింది. తొలుత భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిపిఎం సీనియర్ నాయ కులు బి. ఆంజనేయరెడ్డి అధ్యక్షత వహిం చారు. దేవి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలి తాలను కాపాడే మాటలు ఎలా ఉన్నా ప్రస్తుత రాజ్యాంగానికి ముప్పు తెచ్చే విధంగా విధానాలు ఉన్నాయని అన్నారు. కార్మికులు, కష్టజీవుల శ్రమ దోపిడీకి వ్యతి రేకంగా బ్రిటిష్ సామ్రాజవాదాన్ని కూల్చేం దుకు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన ఉండి పోరాటం చేసిన భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం భారతదేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి విచ్ఛిన్నం చేసే పనిలో బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. నాటి సామ్రాజ్య వాదులను వీరోచితంగా ఎదిరించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల ఆలోచనలు బిజెపి ఏమాత్రం పట్టించుకోలేదని, సామ్రాజ్య వాదులకు సాగిలపడుతూ సామాన్యులకు తీవ్ర హాని కలుగజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు తమ గోడు చెప్పుకునేందుకు వెళుతుంటే వారిని ముం దుకు రానీయకుండా మోడీ ప్రభుత్వం వారిని అడ్డుకోవడం ఏపాటి దేశభక్తి అని ప్రశ్నించారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటనపై మోడీ ఏం సమాధానం చెబుతారని నిల దీశారు. ఎంతో రాజకీయ చరిత్ర కలిగిన కాంగ్రెస్ ఏనాడూ ఇంత దుర్మార్గంగా, ప్రజా వ్యతిరేక విధానాలను సాగించడానికి సాహసించలేకపోయిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారిలో కాంగ్రెస్ నాయకులు కొంతమంది ఉన్నారని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంతో ఎటువంటి వారసత్వం లేని బిజెపికి దేశభక్తి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. బిజెపి అవలంభిస్తున్న తప్పుడు విధానాలను ప్రశ్నిస్తే దేశ ద్రోహులుగా ముద్ర వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని, దీనికి రచయితలు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు ఇలా ఎవరికి మినహాయింపు లేదని ఎంతో మందిని ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఇటువంటి విధానాలను ప్రశ్నిస్తూ మరో సామ్రాజ్యవాద వలస దేశంగా భారతదేశ మారకుండా ఉండాలంటే ప్రజలు చైత న్యంతో పోరాడాలని అదే భగత్ సింగ్ కి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన నిర్వ హణ కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణ రాజు, వెంగళరాజు సుబ్బరాజు, సరికొండ శేషం రాజు, మస్తాన్వలి, మెట్టు కోటిరెడ్డి, జి చిన్నపరెడ్డి, పచ్చవ రామారావు, మేకా శ్రీని వాసరెడ్డి ,కోటా నాయక్, వెనా అప్పిరెడ్డి, నరసింహారాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాసే బిజెపి కూటమిని ఓడించాలి

ప్రజాశక్తి మంగళగిరి

కార్మిక హక్కులను కాలరాసే బిజెపి దాని మిత్ర పక్షాలైన టిడిపి జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వర రావు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో నియోజకవర్గ సిఐటియు విస్తృత సమావేశం వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఉమామహేశ్వరరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా దేశంలో నిరంకుశ పాలన కొనసాగిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించే విధంగా విధానాలు ఉన్నాయని అన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. యూనియన్ పెట్టుకునే విధంగా చర్యలు లేవని అన్నారు. గత పది సంవత్సరాల్లో దేశంలో ప్రజల మధ్య అంతరాలు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదాని లకు దేశంలో ఉన్న సహజ సంపదలను దోచిపెడుతున్నారని విమర్శించారు. మతాలు, కులాల పేరుతో దేశంలో ఉన్న ప్రజలను విడదీసి, వారి మధ్య వివాదాల సష్టించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. మతాల పేరుతో మారణ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు


హెూమాన్ని సష్టించడానికి చూస్తుందని విమర్శించారు. మణిపూర్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో క్రైస్తవులను, ముస్లింలను దారుణంగా హత్యలు చేయించడం జరిగిందని అన్నారు. ఆంధ్ర ప్రదేశంలో బిజెపి అవలంబించిన విధానం వలన అభివృద్ధి కుంటుబడిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని అన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదని విమర్శించారు. బిజెపి రాష్ట్రాన్ని చేసిన అన్యాయాన్ని ప్రశ్నించడానికి టిడిపి జనసేన, వైసిపి పార్టీలు ముందుకు రావడంలేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిజెపి ప్రభుత్వ విధానాలను అన్నింటిని అమలు చేస్తుందని విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసెంబ్లీలో కార్మికుల సమస్యల గురించి ప్రశ్నించడానికి వామపక్ష పార్టీలను, ఇండియా బ్లాక్ వేదిక అభ్యర్థులను ఈ రాష్ట్రంలో కార్మిక వర్గం గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు నన్నపనేని శివాజీ, సిఐటియు నాయకులు వై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు చేసి ప్రజలపై భారం వేస్తున్న జగన్

దుగ్గిరాల రచ్చబండలో నారా లోకేష్

ప్రజాశక్తి దుగ్గిరాల

జగన్ ప్రభుత్వం అప్పులు చేసి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అప్పుల భారం తగ్గించుకునేందుకు ప్రజలపై భారం వేస్తుందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంగళగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి నారా లోకేష్ విమర్శించారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని చెన్నకేశవ నగర్‌లో సోమవారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అప్పులను తగ్గించుకునేందుకు ఇంటి పన్ను చెత్త పన్ను కరెంటు చార్జీలు ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపైనే భారం వేస్తుందన్నారు. జగన్ కటింగ్ మాస్టర్ అని కరెంటు చార్జీలు పెంచి ఎక్కువ కరెంటు వినియోగిస్తున్నారని తెల్ల రేషన్ కార్డు కట్ చేస్తున్నారని విమర్శించారు . కరెంటు చార్జీలు 9సార్లు ఆర్టీసీ చార్జీలు మూడుసార్లు పెట్రోల్ డీజిల్ చివరకు క్వార్టర్ మందు ధరలు కూడా పెంచారన్నారు. నాణ్యతలేని చీప్ లిక్కర్ అమ్మి ప్రజల ప్రాణాలు తోడేస్తూ కుటుంబాలను అనాథలుగా మారుస్తున్నాడని జగన్ పై దుమ్మెత్తి పోశారు. ఐదు సంవత్సరాలు కాండ్రు కమల, పది సంవత్సరాలు ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరి ఎమ్మెల్యేలుగా చేశారని దుగ్గిరాల మండలం అభివృద్ధికి నోచుకోలేదు ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని రోడ్లు ఎక్కారన్నారు. ఆ రోడ్లు ఎంత అద్వాన్నంగా ఉన్నాయో చూడండి, రోడ్లకు ప్యాచింగ్ వర్క్ కూడా చేయించలేని ఎమ్మెల్యే మీ పిల్లలకు ఉద్యోగాలు ఎలా ఇప్పిస్తాడని ప్రశ్నించారు. తాము మంగళగిరి కి కంపెనీలు తీసుకొచ్చే బాధ్యత తీసుకొని మీ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇస్తున్న హామీలు అన్నిటిని తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. రోడ్లు డొంక రోడ్లు మరమ్మత్తులు చేసి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20వేల ఆర్థిక సహాయం చేస్తామన్నాడు. సిఎఎ కు రాజ్యసభలో సంపూర్ణ మద్దతు తెలిపింది వైయస్సార్సీపీ అని గుర్తు చేశారు. బిజెపి జనసేన టిడిపి పార్టీ వారిని సరైన వేదికలు కూర్చోబెట్టి ఈ విషయమై చర్చిస్తామని



మాట్లాడుతున్న నారా లోకేష్

ముస్లింలకు హామీని ఇచ్చారు. 3130 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల సమస్యను తెలుసు కున్నాను సమస్యలు పరిష్కరించేందుకు తమకు అవకాశం కల్పించవలసిందిగా కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 29 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు వెంకటరావు కేశంనేని శ్రీ అనిత వల్లూరు నరసింహారావు గద్దె శ్రీనివాస్ ఏళ్ల జయలక్ష్మి పాటిబండ్ల కష్ణ ప్రసాద్ కొరిటాల సురేష్ ఉన్నం రఘూన్సీ జనసేనకు చెందిన పసుపులేటి శ్రీనివాస్ పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌తో కెల్‌యు ఎంఒయు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రష్యాలోని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సైబీరియన్ బ్రాంచ్ యొక్క ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్-టెరెస్ట్రియల్ ఫిజిక్స్ అనే సంస్థతో కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలోని ఈసిఈ విభాగం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలోని నుండి డాక్టర్ డి. వెంకట రత్నం సంబంధిత బృందాలకు నాయకత్వం వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతరిక్షంలోని వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులపైన పరిశోధనాలు, శాస్త్ర సాంకేతిక రంగంలో పరస్పర సహకారం కోసం ఈ అవగాహనా ఒప్పందం చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ అవగాహన ఒప్పందం వలన కెఎల్ యులోని ఈసిఈ విబాగం అంతరిక్ష వాతావరణంపై దృష్టి సారించి శాస్త్రీయ మరియు విద్యాపరమైన సహకారం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. యూనివర్శిటీ మరియు ఐఎస్టిపి- ఆర్ఎఎస్‌ల మధ్య సన్నిహిత మైత్రిని ఏర్పరచడానికి, ఉమ్మడి శాస్త్ర సాంకేతిక కార్యకలాపాలను సులభతరం చేయడానికి అవగాహనా ఒప్పంద పత్రాలపైన సంతకాలు చేసినట్లు తెలిపారు. జిఎన్ఎస్ఎస్ డేటా మార్పిడి, పరిశోధన సిబ్బంది మరియు ఉమ్మడి ప్రాజెక్ట్‌లు, సెమినార్‌లు, వర్క్ షాప్‌లు మొదలైన వాటిపై పరస్పర సహకారం రెండు సంస్థల మధ్య జరుగుతుందన్నారు. దీంతో ప్రధాన పరిశోధనా రంగంలో పలు అంశాలపై ఉమ్మడి పరిశోధనలు చేయనున్నట్లు



ఒప్పంద పత్రాలను చూపుతున్న విసి పార్ధసారధివర్మ తదితరులు

తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు , ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, డాక్టర్ఎం.శ్రీధర్, డాక్టర్ సంపత్ కుమార్ పాండా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవను అలవరుచుకోవాలి

కెఎల్ యు డీన్ డాక్టర్ సిహెచ్. హనుమంతరావు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ప్రతి ఒక్కరు విద్యార్థి దశలోనే సమాజ సేవను అలవరుచుకుని సమాజాభివృద్ధికి దోహదపడాలని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డీన్ డాక్టర్ సిహెచ్. హనుమంతరావు వాలంటీర్లకు సూచించారు. ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం ఆయన శిబిరాన్ని సందర్శించి వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామంలో ఏడు రోజులు పాటు జరిగిన కార్యక్రమాలలో ముఖ్యంగా వేసవి కాలంలో నీటి పొదుపుపై ఇంటింటికి తిరిగి వాలంటీర్లు అవగాహన కల్పించడం, విద్యుత్ వినియోగం, తగ్గింపుపై ప్రజలకు సూచనలు అందజేయడం, ఫార్మసీ విద్యార్థులు ఇంటింటికి హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయటం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంపకం పట్ల అవగాహన కల్పించటం, వ్యవసాయ కూలీలకు, వీధి వ్యాపారులకు ఎండ తీవ్రత నుంచి ఎలా రక్షించుకోవాలో సూచనలు చేయటం, అగ్ని ప్రమాదాల నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి తదితర సేవా కార్యక్రమాలు చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి వివరించారు. వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే. సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్. సుప్రియ తదితరులు సేవా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను అభినందించగా పి. సురేష్, జి. చంద్రశేఖర్ లు శిబిరానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.



గ్రామస్తులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న కెఎల్ యు విద్యార్థులు



ఘనంగా హోలీ వేడుకలు

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులు, వివిధ ప్రాంతాల నుంచి పనులు నిమిత్తం వచ్చిన వలస కూలీలుతమ గుడారాలు వద్ద హోలీ పండుగ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకొని సందడిని చేశారు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



నాగులపాడులో రామాంజనేయులుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బి. రామాంజనేయులు అన్నారు. సోమవారం పెదనందిపాడులో రావి శివరామకృష్ణయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పోలింగ్ కేంద్ర ఇన్‌ఛార్జిలకు నియమక పత్రాలను అందజేశారు. సమావేశంలో జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, నర్రా బాలకృష్ణ, పాటిబండ్ల నాగేశ్వర రావు, జంపని హనుమంతరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం నాగులపాడు గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఎడ్ల బండి పై రామాంజనేయులకు ఘనస్వాగతం లభించింది. తొలుత పెదనందిపాడు విచ్చేసిన రామాంజనేయులు పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ వ్యక్తిగత స్వార్థం కోసం

మాదిగలను తాకట్టు పెట్టారు

ప్రజాశక్తి-తాడేపల్లి



వ్యక్తిగత స్వార్థం కోసం మాదిగలను తాకట్టు పెట్టిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు విమర్శించారు. సోమవారం సాయంత్రం తాడేపల్లి ప్రెస్‌క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ మాదిగలను కేవలం ఎన్నికల సమయంలో అమ్మి వేస్తున్నాడని విమర్శించారు. కృష్ణ మాదిగని ఒక ఉద్యమ కారుడుగా మాదిగలు చూస్తారు తప్ప రాజకీయంగా కాదని అన్నారు. 2019 ఎన్నికల్లో నందిగం సురేష్‌కు ఎంపీ సీటు కేటాయిస్తే కనీసం మద్దతు ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో మాదిగలను అడ్డం పెట్టుకుని మందకృష్ణ మాదిగ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు తప్ప ఏ రాజకీయ పార్టీ మందకృష్ణను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న మందకృష్ణ తమకు పది అసెంబ్లీ సీట్లు ఇవ్వమని చంద్రబాబును ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. సీట్లు కోసం కాకుండా కాసులు కోసం వర్గీకరణ అనే సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని స్వార్ధ ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలకు వర్గీకరణ అంశం ఆట వస్తువుగా మారిందని విమర్శించారు. ఈ సమావేశంలో వైసీపీ తాడేపల్లి పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మంచి నీటి చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో విజన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొర్రా వెంకట అప్పారావు సోమవారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజలకు దాహాన్ని తీర్చేందుకు పిడుగురాళ్ల సత్తెనపల్లి ప్రధాన రహదారి ప్రక్కన, రహదారిలో ప్రయాణించే వారికి మంచినీటి దాహాన్ని తీర్చే విధంగా వాహనదారులకు, పాదచారుల దృష్ట్యా ప్రధాన రహదారిపై ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కె.సాంబశివరావు, ఆర్.సుమన్ పాల్గొన్నారు.



'మాదిగలంతా ఐక్యంగా ఉన్నారు'

ప్రజాశక్తి-మాచర్ల

ఎస్‌సి వర్గీకరణ మాదిగలకు ముఖ్యమైన అంశమని మాచర్ల నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మాచర్ల రూబెన్‌మాదిగ అన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్నమాదిగల కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సమావేశం జరిగింది. పట్టణ అధ్యక్షులు రాజ రావు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రూబెన్ మాట్లాడుతూ వర్గీకరణకు బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం న్యాయపరమైన అడుగులు వేస్తున్న తరుణంలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాచర్ల దానియేలు, బి శివమాదిగ, కిరణ్‌మాదిగ, ఏసురత్నం, నవీన్, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతర హుండీ ఆదాయం రూ.20 లక్షలు

ప్రజాశక్తి -దుర్గి

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన అడిగోప్పల శ్రీ నిదానంపాటి అమ్మవారి ఆలయ తిరునాళ్ల పురస్కరించుకుని ఆదివారం సందర్శకులు ఆలయంలోని హుండీలో రూ.20 లక్షల 30 వేల 422 వేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఈ సైదమ్మ బాయ్ తెలిపారు ఆలయ జాతర ప్రత్యేక అధికారి సత్యనారాయణరెడ్డి సమక్షంలో సోమవారం ఆలయ ముఖ మండపంలో పలువురు ఈవోల సమక్షంలో ఆలయంలోని హుండీలలోని కానుకలను లెక్కించారు. గత సంవత్సరం జాతరకు 24 లక్షల 72 వేల తొమ్మిది వందల అరవై మూడు రూపాయలు వచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో సందర్శకులు తక్కువ మంది వచ్చినట్లు చెప్పారు. దీంతో హుండీ ఆదాయం తగ్గిందని అన్నారు.

హోలీ వేడుకలు



మహిళలతో కలసి హోలీ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

హోలీ పండగను పురస్కరించుకొని సోమవారం స్థానిక 3వ వార్డులో ఏర్పాటు చేసిన సంబరాలలో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. రంగునీళ్ళలో అయన తడిసి ముద్యయ్యారు. అనంతరం ఉట్టి కొట్లే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాగ ద్వేషాలకు అతీతంగా అందరు కలసి సంతోషంగా జరుకొనే పండగే ఈ రంగేళి హోలీ అని అన్నారు.

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ధర్మ కర్త కేతావత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



గిరిజనులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాండు నాయక్ మాట్లా డుతూ హోలీని బంజారులు సంప్ర దాయంగా జరుపుకుంటారని చెప్పారు. సహజమైన రంగులతో హోలీ నిర్వహించుకోవాలని, కాలుష్యాన్ని నిర్మూ లిం చాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కల్లకుంట మాజీ సర్పంచ్ ముడావత్ బాలాజీ నాయక్,సర్పంచ్ శ్రీను నాయక్, వైస్ చైర్మన్ ముడావత్ మంగతా నాయక్, సభావత్ మంగథానాయక్, జనసేన మండల ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్,టీడీపీ మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ముడావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెల పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వినుకొండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నరసరావుపేట ఎంపిగా అనిల్ కుమార్ ను ప్రజలు గెలిపిస్తే వరికపూడిసెల పూర్తిచేసి పల్నాడు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. సోమవారం రాత్రి స్థానిక 3వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమికి ప్రజలు అధికారమిస్తే సంక్షేమ పథకాలకు ముగింపు పలికినట్టేనని స్పష్టం చేశారు. విద్య వైద్య రంగంలో ప్రపంచంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు మరోసారి మద్దతు తెలపాలని, వినుకొండ పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించింది ఎవరో ప్రజలు గుర్తుంచు కోవాలని అన్నారు.



మంత్రి అంబటి రాంబాబును సన్మానిస్తున్న చిత్రం

గంగమ్మతల్లి ఆలయ అభివృద్ధికి మరింత కృషి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

గంగమ్మతల్లి ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తాను అని మంత్రి అంబటి రాంబాబు అన్నారు . సోమవారం పట్టణం లోని 28వ వార్డు దోబీఘాట్‌లోని గంగమ్మతల్లి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఇప్పటికే రూ.3 లక్షలు ఇచ్చామని, ఇంకా అవసరమైతే మరిన్ని నిధులతో పాటు వస్తు సామగ్రిని అందేలా చూస్తామన్నారు..అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు.

ఎంతో అభివృద్ధి చేశాం: వైసిపి

ప్రజాశక్తి-మాచర్ల

నాల్గుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగిందని కౌన్సిలరు రామిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. తమకు ఉన్న ప్రజాదరణ వలనే తమకు విజయంపై విశ్వాసం ఉందని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలను 50 పడకలకు పెంచటం, నాడు నేడు పథకంతో శోభ చేకూర్చామని అన్నారు.

'వైసిపిలో మిగిలేది జగన్, ఆయన అభ్యర్థులే'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల నాటికి వైసిపిలో మిగిలేది జగన్, ఆయన అభ్యర్థులేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం స్థానిక పండరీపురంలోని తన నివాసంలో టిడిపిలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ వైసిపిలో మిగిలిన నాయకులు, క్యాడర్ అంతా తలోదిక్కు చూసుకోవడం ఖాయమని, టిడిపిలోకి కొనసాగుతున్న వలసలే అందుకు నిదర్శమన్నారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు జోరుగా సాగుతున్నట్లు చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన 100 మంది కార్యకర్తలు, ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు చెప్పారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేయడం, వైద్యుడిని వేధించి చంపడం, మహిళలకు రక్షణ లేకపోవడం, రూ.వేల కోట్ల డ్రగ్స్ మాఫియా నడవడం వంటివి వైసిపి రాక్షస పాలనకు అద్దం పడుతున్నాయన్నారు.

గ్రూపు రాజకీయాలేకుండా నడవాలి

ప్రజాశక్తి-నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులో సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో విస్తృత సమావేశం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ గ్రామా ల్లో కార్యకర్తల మధ్య గ్రూపు రాజకీయాలు లేకుండా ఒకే తాటిపై నడవాలని సూచించారు. పార్టీలో ఉన్న మండల స్థాయి సీనియర్ నాయకులకు సముచిత స్థానం ఉంటుదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

రాష్ట్రంలో అరాచక పాలన ప్రభు త్వాన్ని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో నాసిరకం మద్యం అమ్మకాల తో ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతూ వైసిపి నాయకులు మంత్రులు వినోదం చూస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు సౌరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, అహ్మద్ బుడే, ఎస్.కోటేశ్వరరావు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.



సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం దారి మళ్లించిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి విమర్శించింది. సత్తెనపల్లి పట్టణంలోని టిడిపి ప్రజా వేదిక లో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్‌పి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఎస్‌పి జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, తెగలు వారిని వైసిపి నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు. తెలుగుదేశం పార్టీ మిత్రపక్షాలైన ఎన్డీఏ కూటమికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సత్తెనపల్లి కమిటీ, మహాజన సోషలిస్టు పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి కె.అశోక్ బాబు. జి అశోక్, కె.బాబురావు. వి.ముసలయ్య, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు



పెదకూరపాడులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సోమవారం ప్రచారం చేపట్టారు. పెదకూరపాడులో ప్రధాన వీధుల్లో ఎన్నికల క్యాంపెయిన్ చేపట్టారు. వ్యాపార వర్గాలతో మమే కమయ్యే ప్రయత్నం చేశారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షులు రమేష్, నాయకులు షేక్ ముంతాజ్, షేక్ అజి ముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల



స్థానిక 29 నుండి 31వ వార్డు లలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిం చారు. ఆజాద్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యువ నాయకులు వై.కేశవరెడ్డి, యాగంటి మల్లికార్జున రావు, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి తెనాలి



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనూష

రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకొని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని స్వీప్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లో ప్రజలకు మునిసిపల్ అధికారులు ఓటు వినియోగం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ యస్.యల్.సుబ్బారావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఏ.రామచంద్రరావు, డి. శ్రీనివాసరావు, వై.అనుపమ, పి.సుధాకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్లు మాధవరావు, అరుణ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి చేబ్రోలు** : స్వీప్ ప్రోగ్రాం ద్వారా క్రమబద్ధమైన ఓటరు విద్య, ఎన్నికల భాగస్వామ్యం అనే అంశాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శలపాడు, శేకూరు గ్రామాలలో పోలింగ్ స్టేషన్ల వద్ద నూతన ఓటర్లకు స్వీప్ ప్రోగ్రాంతో పాటు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ఈఓపిఆర్ అండ్ ఆర్ డి జి శ్రీనివాసరావు తెలిపారు. స్వీప్ కార్యక్రమానికి హోలీ పండుగ కూడా తోడవడంతో అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద యువత ఇతర ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాగ్స్ టీం, నూతన ఓటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్కువ పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ జరిగిన మిద్దె సెంటర్లోని పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి రాజకుమారి ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును కచ్చితంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలింగ్ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అనంతరం హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు అనేక రకాల పోటీలు నిర్వహించే బహుమతులను అందజేశారు.



మంగళగిరిలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి

ఎంపి అభ్యర్థిగా కృష్ణప్రసాద్ ఎంపిక హర్షణీయం

ప్రజాశక్తి–తెనాలి

కూటమి అభ్యర్థిగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను ప్రకటించటం హర్షణీయమని మీడియా ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, టిడిపి నాయకులు మూల్పూరు మాణిక్యరావు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో గుంటూరు జిల్లా ఎస్పీగా కృష్ణప్రసాద్ పనిచేశారని, ఆయనకు జిల్లాపై పూర్తి అవగాహన ఉందన్నారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, పైగా దళిత సామాజిక వర్గానికి చెందిన కృష్ణ ప్రసాద్‌కు సముచిత స్థానం లభించిందన్నారు. సమావేశంలో వేమూరు, కొల్లూరు, అమృతలూరు మండలాల కూటమి నాయకులు ఎం.రమేష్, ఎ.సుబ్రహ్మణ్యం, జి.వెంకటకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ

మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ

స్వతంత్ర అభ్యర్థి లేదా కాంగ్రెస్ పార్టీ గుర్తుపై పోటీ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చామని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం పొన్నూరు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ షేక్ సుఫియా సుల్తాన్ స్వగృహములో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థి, లేదా కాంగ్రెస్ పార్టీ గుర్తుపై పోటీ చేయాలనే నిర్ణయాన్ని నియోజకవర్గంలోని తన అభిమానులు, కార్యకర్తల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. గత దశాబ్ద కాలంగా పొన్నూరులో తెలుగుదేశం పై అవిశ్రాంతంగా వైసిపి కార్యకర్తలు పోరాడారన్నారు. 2019 ఎన్నికల్లో నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్యను అధిష్టానం నిర్ణయించడం జరిగిందన్నారు. వైసీపీ గెలవాలని పెద్ద ఎత్తున పని చేశారన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వైసిపి కార్యకర్తలను పట్టించుకోకుండా పార్టీకి దూరంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో తాను ఎక్కడ జోక్యం చేసుకోలేదని చెప్పారు. పొన్నూరులో వైసీపీ కార్యకర్తల సమస్యలు పరిష్కారం కావడం లేదని, పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని, దానిని అడ్డుకోవాలని అధిష్టానానికి పలుమార్లు వైసిపి కార్యకర్తలు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేదని వాపోయారన్నారు. తనకు ఎలాంటి సమాచారం, షోకాజు నోటీసు లేకుండానే వైసిపి పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, తాను టీవీలో చూసి తెలుసుకున్నానని, దీన్ని బట్టి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా పనిచేస్తుందనేది చెప్పకనే చెబుతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న సిఐఎస్ఎఫ్ బలగాలతో సిఐ దశరథ రామారావు

పట్టణంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి–తెనాలి

సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు సోమవారం పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించినట్లు పట్టణ ఒన్‌టౌన్ సిఐ దశరధరామారావు తెలిపారు. సిఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి పట్టణంలోని చిన రావూరుతోట, గురవయ్యకాలని, రామలింగేశ్వరపేట, నాజరు పేట, బోస్‌రోడ్డు, గాంధీచౌక్ ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరుతూ కవాతు నిర్వహించినట్లు చెప్పారు. సిఐతో పాటు ఎస్ఐలు, సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.



ప్రజల సంక్షేమం కోసం పథకాలు

వైసిపి అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా నిలుస్తాయని పొన్నూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని 8, 9వ వార్డుల్లో పర్యటించిన ఆయన సమస్యల గురించి స్థానికులతో మాట్లాడారు. సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మురళీకృష్ణకు వార్డుల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, రాజధాని డెవలపర్స్ షేక్ ఖయ్యూం, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి–గుంటూరు

స్థానిక సుద్దపల్లి డొంక తిరుపతమ్మ బజారులో జరిగిన శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి 26వ కళ్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి నసీర్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మహేష్, పున్నారావు, తరాలి రాము, దానబోయిన కోటేశ్వరరావు, కృష్ణ, ఎల్లావుల అశోక్, ఐల శ్రీనివాసరావు, జి.ప్రభాకర్ పాల్గొన్నారు.


అన్నదానం ప్రారంభిస్తున్న నసీర్

బ్రహ్మోత్సవాల్లో ఘనంగా రథోత్సవం

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుండి ప్రజల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రథోత్సవ కార్యక్రమానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టిడిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, వైఎస్ఆర్సిపి మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య, వైఎస్ఆర్సిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సిపి నాయకులు గంజి చిరంజీవి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.





ముస్లింల సంక్షేమం టిడిపి బాధ్యత

టిడిపి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

ముస్లింల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ బాధ్యతాయుతంగా పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం పొన్నూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పొన్నూరు జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కొండేయబాబు 25, 26, 27, 28, 29 వార్డుల్లోని ముస్లిం మైనార్టీలతో ఇటికంపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి టిడిపి ముస్లిం మైనార్టీ నేత షేక్ బాజీ సాహెబ్ అధ్యక్షత వహించారు. ముస్లిం మైనార్టీలకు దుల్హన్ పథకం, ఇమామ్లు, మోజాంలకు జీతభత్యాలు, మసీదుల రిపేర్లకు నిధులు రంజాన్ తోఫా, అబ్దుల్ కలాం విదేశీ విద్య, మైనార్టీ కార్పొరేషన్ లోన్లు ఇవ్వాలని, పలు సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ముస్లింలు కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు షేక్ మోసిన్, ఫై రోజు ఖాన్, అహ్మద్ ఖాన్, జనసేన అధ్యక్షుడు కరిముల్లా, షేక్ బాబ్జి, జానీ భాషా బేగ్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న మంత్రి రజిని

వైభవంగా వెంకటాచల కళ్యాణమహోత్సవం

ప్రజాశక్తి–గుంటూరు

స్థానిక నందివెలుగు రోడ్డు, వస్త్రనగర్‌లో పద్మావతిగోదాసమేత కామ్యసిద్ధి వెంకటాచల స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, పలువురు రాజకీయ ప్రముఖులు, దేవస్థాన కమిటీ అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరెడ్డి, కార్యదర్శి ఎం.వి.శేషగిరిరావు, ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టి.సూర్యనారాయణ, కె.నరసింహారావు, జి.శ్రీనివాసరావు, కె.వేణుగోపాల్, నాగేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఉత్సవాల్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం యుపిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గణపతి నగర్లోని ఇందిరానగర్ డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష యాత్రికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో యాత్రికులకు వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేశామన్నారు. నగర పరిధిలోని ఇందిరానగర్, మార్కండేయ కాలనీ, కుప్పురావు కాలనీ, యర్రబాలెం, రామచంద్రాపురం, కుంచనపల్లి యూపీహెచ్సీల వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారన్నారు.

పలు సంఘాల వితరణ

రథోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే యాత్రికులకు పద్మజ్యోతి సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం టిటిడి కల్యాణ మండపం–మంగళగిరిలో అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు కాండ్రు కమల, కొల్లి వాసు, పద్మజ్యోతి సేవా సంఘం కమిటీ సభ్యులు, మరియు అన్న ప్రసాద వితరణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. శ్రీపేద అనాధల మాత సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత పానకం, మజ్జిగ మరియు ఐస్ క్రీమ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లింగనేని శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు సాదరబోయిన నాగేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది


అన్నదానంలో పాల్గొన్న మురుగుడు లావణ్య

నేటి నుండి యధావిధిగా నీటి సరఫరా

ప్రజాశక్తి-గుంటూరు


మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు

సంగం జాగర్లమూడి హెడ్‌వాటర్ వర్క్స్ నుండి గుంటూరు నగరానికి తాగునీటి సరఫరా జరిగే పైప్‌లైన్‌పై ఏర్పడిన లీకు మరమ్మతు పనులను సోమవారం నుండి ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారని, మంగళవారం ఉదయానికి పనులు పూర్తిచేసి సాయంత్రం పాక్షికంగా, బుధవారం ఉదయం నుండి పూర్తి స్తాయిలో తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ కీర్తిచేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీకు మరమ్మతు పనులను నిర్దేశిత షెడ్యులు మేరకు మంగళవారం ఉదయానికి పూర్తి చేసి సాయంత్రం నుండి సరఫరా పునరుద్ధరణ చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం సాయంత్రం పాక్షికంగా బుధవారం ఉదయం నుండి పూర్తి స్తాయిలో తాగు నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు : పన్ను చెల్లింపుదారులకు వీలుగా జిఎంసి క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు.వడ్డీ లేకుండా పన్ను చెల్లించటానికి మార్చి నెలాఖరు వరకే గడువు ఉందన్నారు. నెలాఖరు రోజు సర్వర్ సమస్య తలెత్తే అవకాశం ఉందని, కావున నెలాఖరు వరకూ వేచి చూడకుండా ముందే పన్ను చెల్లించాలని కోరారు. ఏప్రిల్ 1 నుండి పన్ను బకాయిపై వడ్డీ జమ అవటంతోపాటు, పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.


వేడుకల్లో పాల్గొన్న చివరి సంవత్సరం డిగ్రీ విద్యార్థినులు

బిహెచ్ కాలేజీలో వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ కాలేజిలో చివరి సంవత్సరం డిగ్రీ విద్యార్థినులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో బజాజ్ జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, వైస్‌ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు పాల్గొని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి.


గీతాంజలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న సినీ రచయిత కోన వెంకట్

సోషల్ మీడియా శాడిజానికే గీతాంజలి బలి

పిల్లలు ఇరువురికి సినీ అవకాశం కల్పిస్తా : సినీ రచయిత కోన వెంకట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన గొల్తి గీతాంజలి కుటుంబ సభ్యులను ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ సోమవారం పరామర్శించారు. స్థానిక వహాబ్ చౌక్ గీతాంజలి నివాసంలో తమ కుటుంబ సభ్యులను కలిసి రూ 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సోషల్ మీడియాలో వేధించిన అసభ్య ట్రోలింగ్స్ కారణంగానే గీతాంజలి బలవన్మరణానికి పాల్పడిందని వెంకట్ పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఇలాఖాలో సంక్షేమం పొందడమే తాను చేసిన తప్పా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆమె పొందిన సంక్షేమాలను ఒక యు ట్యూబ్ ఛానల్ లో వివరించడం నిమిషాలు వ్యవధిలోనే ఆమెపై సోషల్ మీడియా ట్రోలింగ్స్ దాడిచేయడం విచారకరమన్నారు. సోషల్ మీడియా శాడిజానికి గీతాంజలి బలవ్వడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. గతంలో సోషల్ మీడియా ట్రోలింగ్స్ కారణంగా మనస్తాపానికి గురైన వారిలో తానూ ఒకడినని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించడం సరికాదన్నారు. ఒక అమ్మ, భార్యనే కాకుండా నిస్వార్థమైన ఆనందాన్ని పొట్టనపెట్టుకున్న ఎల్లో సోషల్ మీడియా వికృతచేష్ఠలను తీవ్రంగా ఖండించారు. అసభ్యపదజాలంతో స్త్రీ జాతిని అవమాన పరచిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తాను తీయనున్న ఒక సినిమాలో గీతాంజలి కుమార్తెలు రిషిత, ఋషికలకు అవకాశం కల్పిస్తామని గీతాంజలి భర్త బాలచందర్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మేక ప్రతాపరెడ్డి, వైసిపి లీడర్లు భరత్ రెడ్డి, బెనర్జి, నాగిరెడ్డి పాల్గున్నారు.

దాహం...దాహం

- బొల్లాపల్లిలో అడుగంటిన భూగర్భ జలాలు
- చుక్కనీరు ఇవ్వని చేతి పంపులు
- ఆందోళన చేపట్టినా పట్టించుకోని అధికారులు
- తాగునీరు లేక అల్లాడుతున్న గిరిజన వాసులు



ప్రజాశక్తి - వినుకొండ

తాగునీటి కోసం కేవలం బోర్లపైనే ఆధారపడే జీవించే బొల్లాపల్లి మండలం గిరిజన వాసులకు గొంతు తడవడం కష్టమవుతోంది. భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామాలు, తండాల్లోని బోర్లలో చుక్కనీరు పడడం లేదు. దీంతో దూర ప్రాంతాల్లోని వ్యవసాయ బోర్లవైపు జనాలు ఆశగా చూస్తున్నారు. త్రీఫేజ్ కరెంటు సరఫరా ఉన్న సమయంలో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల నుండి నీటి మోసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. భూగర్భ జలాలు పూర్తిగా పడిపోవడంతో ఆ కాస్త నీరు కూడా అన్ని బోర్ల వద్దా దొరకడం లేదు. బిందెడు నీటి కోసం గంటలు తరబడి నిరీక్షణ చేయాల్సి వస్తోంది. బొల్లాపల్లి మండలంలోని



చక్రాయపాలెం, గండిగనుమల, సోలాయిపాలెం, లాలీపురం, బిఎల్ కాలనీ, అయ్యన్నపాలెం, రాజానాయక్ తండ, హనుమాపురం, దోమలగుండం, వెంకటరెడ్డిపురం, రేమిడిచర్ల, రావులాపురం, గుమ్మనంపాడు, గరికపాడు, పమిడిపాడు, మేళ్లవాగు తదితర గ్రామాల్లో 1200 అడుగుల వరకు బోరు వేసినా నీటి చుక్క జాడ లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం నిత్యం అగచాట్లు పడుతున్నారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్లలో కూడా కొద్దిపాటి నీరు రావడంతో గంటలకొద్దీ నిరీక్షించి మరి బిందెలతో మోసుకొచ్చుకుంటున్నారు. తాగునీటి సరఫరా విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు విస్మరించారు. కూలీ పనులకెళ్తేనే ఇల్లు గడిచే పేదలు నీరు కావాలంటే తమ పనులు మానుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ బోర్ల నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు సరఫరాకు అవకాశం ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. స్వచ్ఛంద సంస్థలు కొంత మేరకు ఈ ప్రయత్నం చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో స్థానిక సంస్థలే సరఫరా చేస్తున్నా అందులోనూ రాజకీయ వివక్ష చూపుతూ ప్రజల్ని ఇబ్బందుల పాల్జేస్తున్నారు. దీనిపై ఆందోళనలు జరిగినా పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. గతేడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినకొండలో జరిగిన బహిరంగ సభలో మూగచింతలపాలెం డీప్ కట్టు నుండి పైప్‌లైన్ ఏర్పాటు చేసి బొల్లాపల్లి చెరువుకు సాగర్ జలాలు నింపి ఆయా ప్రాంతాల్లోని గ్రామాలకు తాగునీటి సరఫరా చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, అందుకు 15 కోట్లు నిధులు కేటాయిస్తున్నామని హామీనిచ్చినా నెరవేరలేదు. ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని, వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మించి శాశ్వతంగా తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, లేనిపక్షంలో మీకు మా మొహం చూపించబోమని ఎన్నికలకు ముందు బీరాలు పలికిన నేతల మాటలు మళ్లీ ఎన్నికలు వస్తున్నా అమలు నోచుకోక నీటి మూటలయ్యాయి.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

మ్యాన్‌పవర్ సెల్ అధికారులతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, సక్రమంగా నిర్వహించడంలో పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని, వీరికి ప్రత్యేక శిక్షణ ఎంతో అవసరమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో మ్యాన్‌పవర్ సెల్ అధికారులతో జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్‌బూత్ అధికారులను, ఇతర పోలింగ్ సిబ్బందికి సంబంధించి రాండమైజేషన్ చేపట్టవలసి ఉందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ పెద్దిరోజా, మ్యాన్‌పవర్ సెల్ నోడల్ అధికారి, డిఇఒ శైలజ, డిఐఒ బిమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీలో సమీవున్ ప్రతిభ

ప్రజాశక్తి-తాడేపల్లి



రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు -2024లో తాడేపల్లి పట్టణం నులకపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (ఉర్దూ) ఎనిమిదో తరగతి విద్యార్థిని షేక్ సమీవున్ గుంటూరు జిల్లాకు సంబంధించి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షాహిద్ అలీని స్థానికులు, తల్లిదండ్రులు అభినందించారు.

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

తిరునాళ్లలో శ్రీ దత్త హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ అన్నారు. దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో శ్రీ లక్ష్మీ అమ్మవారు తిరునాళ్ల లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ మరియు శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 400 మందికి పైగా జలుబు, దగ్గు, జ్వరం, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. నరసరావుపేటలో తమ హాస్పిటల్ స్థాపించిన అనతికాలంలోనే పల్నాడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు గాంచిందని అన్నారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు దత్త హాస్పిటల్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మ భాయ్, ఆలయ ప్రధాన అర్చకులు విజయ రామ్ కుమార్, శేషాచార్యులు హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్న శ్రీదత్తా వైద్యశాల వైద్యులు, సిబ్బంది